

# వెలిసిన శిఖరాలు

## పోల్కంపల్లి శాంతాదేవి

హైదరాబాద్ నగరంలోని ఒక పాతవీధి.

పూజా పునస్కారాలు జరుపబడుతున్న వేణుగోపాలస్వామి వారి ఆలయం.

ఆలయం వెనుకగా దేవగన్నేరు చెట్టు క్రింద పావుగంటనుండీ తీవ్రమైన వాదోపవాదాలు జరుగుతున్నాయి శ్రీ మాలికీ, అతడి బృందానికీ మధ్య.

సహజంగా ఎర్రనిఛాయ కలిగిన శ్రీమాలి ముఖం కోపంతో, దెబ్బతిన్న అహంతో మరింత జేవురించి కెంపు వన్నెకు తిరిగింది.

"ఆగ్రహం చెందే అవసరం లేదు, శాస్త్రీ! కావాలంటే నేను నిరూపిస్తాను." గంభీరంగా ధ్వనించింది రాజారాం గొంతు.

"ఎలా?" తీక్షణంగా చూచాడు, స్నేహితులతో శాస్త్రిగా పిలువబడే శ్రీమాలి మనోహర శాస్త్రి.

"ఎలాగో? ఏమిటో ప్రత్యక్ష సాక్షిని నిన్నే.... నిన్నే చేసి తీరుతాను."

"అసంభవం."

"కాదు—సంభవమే."

"చూద్దాం."

"చూడు అతి త్వరలోనే"

శ్రీమాలి స్నేహితుల్లో ఒకడైన జగ్గయ్య జంధ్యం వేసుకొని, సంధ్యావందనం, దేవతార్చన నిత్యం తప్పకుండా చేస్తాడన్న వార్త ఈ వాదోపవాదాలకు కారణమైంది. జగ్గయ్య కులానికి కుమ్మరి. కాని, కులవృత్తిని వదిలేసి కొన్ని తరాలైంది. ఆ కుటుంబ సభ్యులంతా బాగా చదువుకొని మంచి ఉద్యోగాలలో వున్నారు. జగ్గయ్య శ్రీమాలితోపాటు బి. ఏ. పాసయ్యాడు. బి.ఇడి., ట్రెయినింగ్ అయి కొద్ది నెలల్కకితం అధ్యాపక వృత్తిలో ప్రవేశించాడు కూడా. వివాహం అయి ఒక కొడుకు కూడా పుట్టాడు.

జన్మతః బ్రాహ్మణుడైన శ్రీమాలి, కుమ్మరివాడు జంధ్యం వేసుకొని సంధ్యావందనం చేసినంతమాత్రాన అతడు బ్రాహ్మల్లో చేరిపోడని హేళన చేయడం—అతడు స్పష్టంగా ప్రదర్శిస్తూన్న బ్రాహ్మడినన్న అహంభావం సహించలేకపోయాడు రాజారాం. "మాల మాదుగులు తిరుమల వెంకటేశ్వరుడిని కళ్ళారా దర్శించుకు వచ్చి సమారాధనలు, సత్యనారాయణ స్వామివారి వ్రతాలూ చేస్తూన్న రోజులివి. మీ బ్రాహ్మ లెందరో చీకటి చాటులో హోటళ్ళలో దూరి ఊర పంది మాంసం గొంతుదాకా మెక్కివస్తూన్న రోజులివి. అలాంటప్పుడు సంధ్యా వందనాలూ. దేవతార్చనలూ కేవలం మిమ్మల్ని పట్టుకొనే వ్రేళ్ళాడు తూండాలనడం గర్వాంధకారం! మీరు చేస్తేనే ముక్తి. ఇవతలి వాళ్ళకు కాదాయేం? లేక, ముక్తికి అర్హులు మీ రొక్కరేనా?"

"ఎవడో లఫూట్ వెధవ తింటే తినొచ్చు. కాని, వాడి జన్మ సంస్కారం ఎక్కడికీ పోదు. బ్రాహ్మణ వర్చస్సు లోపించదు. ఈ కుమ్మరివాడు పోగుమీద పోగు నూట పద్దెనిమిది జందెం పోగులు వేసుకొన్నా, త్రికాలసంధ్యలు కాక మరెన్ని సంధ్యలు వార్చినా వాడికి బ్రాహ్మణతేజస్సు రాబోదు. వాడి దెంతైనా కృత్రిమత్వమే!"

"బ్రాహ్మలకు ఓ తేజస్సుకూడా ఉంటుందని కాబోలు!"

"ఉంటుంది. తప్పకుండా ఉంటుంది. నువ్వు కాపువాడివి. నువ్వెంత నీటుగా, గోటుగా తిరిగినా, వేషభాషల్లో నీకూ, మాకూ అట్టే తేడాలేకపోయినా నీభుజాల్లోని పౌరుషం కళ్ళల్లోని పగ నువ్వు కాపువాడివని తప్పకుండా చెబుతాయి. వీడు—శివనారాయణ! కోమటి. కొంచెం ఎర్రగా బుర్రగా ఉన్నాడు కొంచెం చటుక్కున చూస్తే బ్రాహ్మల కుర్రాడే అనుకొనేలా. మనతోపాటు చదువుకొన్నాడు. వేషభాషలు మనపోలికే. కాని, వాడిగొంతులో బొంగురు. మె మ్మె మ్మే మాటలు. చిరుబొజ్జ, వాడికళ్ళలో మోసపు చాయలు, నక్కజిత్తులు వాడిలోని కోమటిని ఇట్టే పట్టిస్తాయి. ఇలాగే సూక్ష్మంగా పరిశీలిస్తే—ఈ అలవరుచుకొన్న కృత్రిమ సంస్కారం వెనుక వాడి జన్మసంస్కారం బట్టబయలై తీరుతుంది.

"అహఁహఁ. అహఁహఁ." పగలబడి నవ్వాడు రాజారాం. "ఈ ఆధునిక సమాజంలో బ్రాహ్మడెవరో, ఎవరుకాదో నువ్వు ఇట్టే పట్టేయగలవన్నమాట!"

"ఓ!"

"నీతరం కాదులే, శాస్త్రీ. ఇప్పుడు ఏ కులమూ, ఆకులంగా లేదు. బ్రాహ్మడెవడో, మాలవాడెవడో కనుగొనలేని ఆధునిక

సమాజం మనది. కులాలే తారుమారై పోగా కుల సంస్కారమంటూ, జన్మ సంస్కారమంటూ ఎవడినీ పట్టుకొని ఉండడంలేదు. ఈ నవీనసమాజంలో ఎవడు ఎవడో, ఎలాంటి వాడో నువ్వు తెలుసుకోలేవు. ఒకవేళ నువ్వు ఊహించగలనన్నా అది నీదృక్పథాన్ని బట్టే గాని వాస్తవకోణంలో కాదు. వీడు కోమటి వాడని తెలుసు కాబట్టి వీడిలోని కోమటి లక్షణాలను తీక్ష్ణంగా పరిశీలించావేమోగాని అపరిచితుడైతే వాడు కోమటి అని నువ్వు ఎంతమాత్రం చెప్పలేవు. ఆలాగే ఎవడికులమైనా, సంస్కారమైనా, జగ్గయ్య సంధ్యా వందనాదికాలుకూడా, అతడు కుమ్మరివాడన్న దృక్పథంతో చూస్తావు కాబట్టి అతడిని కృతకంగా తోస్తుంది. కావాలంటే నేను నిరూపిస్తాను. నీ అహంభావానికి జన్మలో మరిచిపోలేని గుణపాఠం చెప్ప గలను!''

పైన జరిగిన ఛాలెంజీకి ఈ వాదం కారణమైంది!

''తప్పకుండా శాస్త్రికి గుణపాఠం చెప్పాలి. గతిలేక ఇతగాడిస్నేహం పట్టుకొని ఊగులాడుతున్నాంగాని మనతో ఓ పార్టీలకు వచ్చే మనిషా? హోటళ్ళకు వచ్చే మనిషా? ఏమన్నా అంటే మా బామ్మ చంపేస్తుందిరో అంటాడు. ఆ బామ్మ మనుమడి బ్రాహ్మణ్యానికి చక్కటి గుణపాఠం చెప్పి తీరాలి! కావాలంటే మేమూ సాయపడగలం!'' హుషారుగా ఈలవేశాడు శివనారాయణ.

''అంచక్కటి క్రాప్ అందం ఆవెనుక పిలక చెడగొట్టేస్తుందిరా, నాన్నా! తీసెయ్యమని ఎన్నిసార్లో చెప్పాను. వింటేనా? ఇప్పుడు సమయం వచ్చింది. పందెంలో రాజారాం గెలిస్తే శాస్త్రీ తన పిలక తెగ్గోసుకోవాలి!'' మరొక మిత్రుడు మురళి.

''ఆపిలకే ఆడ్డంగా లేకపోతే మనకాలేజీలోని అమ్మాయిలు ఈ ఎర్రోడిని గట్టిగా పట్టుకొని ఒకరి మీద ఒకరు తొవ్వాడేయక పోదురూ? వెధవపిలక ఎంచక్కటి చాన్స్ పోగొట్టిందిరా మనశాస్త్రికి!'' శాస్త్రిపిలకను సుతారంగా ఒక గుంజు గుంజాడు రవీంద్ర.

చిరచిరలాడిపోయాడు శ్రీమాలి. ఏదేశస్థుడికైనా ఒక సంస్కృతీ, సంప్రదాయం అనేవి తప్పకుండా ఉండాలి. అవి అంత చులకనగా వదులుకొని ఎదుటి వాడిలో కలిసిపోవడం అంత తెలివైన పనికాదు. ఈ దేశంలో నేను బ్రాహ్మడిని. ఏకులానికి లేని ఉన్నత సంస్కారం, సంప్రదాయం నాకున్నాయి. వాటిని వదులుకొని నలుగురితో పాటు నారాయణా అనడం—ఎవరు ముందు పడడంకోసం, ఎవరిని ఉద్ధరించడంకోసం? మనదేశం నుండి విదేశాలకు వెళ్ళి పెద్దపెద్ద చదువులు చదివి, డిగ్రీలు సంపాదించుకు వచ్చినా తమ పిలకలనూ, తలపాగాలనూ అతి జాగ్రత్తగా కాపాడుకుని వచ్చిన మహామహు లెందరో ఉన్నారు. ఈ దేశంలోనే నా చదువెంత? నేనెంత! ఈ బోడి ఎమ్మే చదువుకోసం, ఆశనిగొట్టు అమ్మాయిలకోసం నా పిలకను త్యజించమంటావురా, గాడిదా?'' తెచ్చుకోలునవ్వుతో స్నేహితుడి వీపు చరిచాడు శ్రీమాలి.

''నీకూ, నీపిలకకూ రుణం చెల్లేరోజులు వచ్చినట్టే ఉన్నాయ్!''

''బ్రాహ్మడినని అధిక కులస్తుడినని గర్వించడంలోనే నువ్వు క్రింది కులాలను కించపరుస్తున్నావు. శాస్త్రీ! అంతకంటే అపకారం ఏం జరగాలి నీవల్ల? నిన్నూ మాలో ఒకడిని చేస్తాను!'' పట్టుదలగా అన్నాడు రాజారాం.

''చేయలేవు!'' ఖచ్చితంగా అన్నాడు శ్రీమాలి.

''చేస్తాను. నువ్వుమారే అవకాశం, అవసరం రాలేదుకాబట్టి మారలేదిన్నాళ్ళు. నిన్ను మార్చి తీరుతాను. ఇహ ఎన్నాళ్ళో బామ్మ మనుమడిగా, శుద్ధ బ్రాహ్మణయువకుడిగా ఉండవు. నీకో క్రొత్త వ్యక్తిత్వం ఏర్పడి తీరుతుంది. క్రొత్త జీవితం ప్రారంభిస్తావు!''

ఇక్కడ కొంచెం శ్రీమాలి బామ్మగురించి, వాళ్ళ స్థితిగతుల గురించి చెప్పు కొందాం.

శ్రీమాలి బామ్మ మంగతాయారమ్మ పూర్వాచారపరాయణురాలు, మడి దడి ఎక్కువ. కొడుకూ కోడలూ శ్రీమాలి చిన్నతనంలోనే పోగా శ్రీమాలిని ఆవిడేపెంచి పెద్దజేసింది. ఈ వేణుగోపాలస్వామి వారి అర్చకపదవి ఆవిడ మామగారి తండ్రి కాలంనుండి వస్తూంది. సమీపంలో చిన్నపల్లెలో తిండి గింజలకు సరిపడే తరిభూమి, ఆలయం ప్రక్కనే ఉండడానికి చిన్నఇల్లు దేవుడి అర్చకుడికి ఇవ్వబడ్డాయి. ప్రస్తుతం వాళ్ళు ఉంటున్నది ఆ చిన్న ఇంటిలోనే. ఆలయం చుట్టూ ఉండే సత్రపు గదులు ప్రస్తుతం అద్దె ఇళ్ళుగా మార్చబడ్డాయి. వాటిమీద వచ్చే అద్దె న్యాయంగా పొందవలసిన వాడు, దిగంబరరావని-ఆ ఆలయం ధర్మకర్తల వంశంలోని వాడు-ప్రస్తుతం బెంగుళూరులో బిజినెస్‌లో ఉంటున్నాడు. సాధారణంగా అతడు ఇటువైపు రాడు. ఆ మధ్య కొన్నేళ్ళ క్రితం ఒకసారి వచ్చినప్పుడు మంగతాయారమ్మ అర్థించింది—''తల్లీ తండ్రీలేని మనుమడికి విద్యాబుద్ధులు చెప్పించుకొంటాను, ఆధారమేదైనా చూపండి, బాబూ!'' అని.

శ్రీమాలి చదువు ముగిసి ఉద్యోగంలో ప్రవేశించేవరకూ, ఆ ఇళ్ళమీద వచ్చే అద్దెల్లో సగం తీసుకొమ్మని, సగం దేవుడి కైంకర్యానికి వినియోగించమని సెలవిచ్చిపోయారాయన.

ఎం. ఎ. పరీక్ష వ్రాసిన శ్రీమాలి ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు చిన్నప్పుడే అమ్మా నాన్నా పోగా పెంచి పెద్దజేసిన బామ్మ అంటే అతగాడికి ప్రేమాభిమానాలకంటే భయభక్తులధికం. బామ్మగారి అదుపాజ్ఞల్లో కట్టుదిట్టంగా పెరిగాడు. బడికి వెళ్ళినా, కాలేజీకి వెళ్ళినా తిరిగి నేరుగా ఇంటికి రావలసిందేగాని అల్లరి చిల్లరి తిరుగుళ్ళను, అతి కఠినంగా నిషేధించింది ఆవిడ. సినిమాలంటే అప్పుడప్పుడూ చూస్తుంటాడుగాని హోటళ్ళలో కాలుపెట్టి ఎరుగడు! స్నేహితుల ఇళ్ళలో కూడా అవీ ఇవీ తీసుకోడు, కాలేజీలో సహాధ్యాయులు కాబట్టి మిత్రపంచకంగా ఏర్పడ్డారు. శ్రీమాలి,


రాజారాం, శివనారాయణ, రవీంద్ర, మురళీ. ఆ నలుగురూ బ్రాహ్మణేతరులే. 'ఏరా?' అని పిలిస్తే శ్రీమాలి అభ్యంతరముండేది కాదుగాని బామ్మ వింటే పిలిచినవాడినీ, పిలిపించుకొన్నవాడినీ దుమ్ము దులిపేస్తుంది. బ్రాహ్మణబిడ్డడు తక్కువ కులంవాడితో 'ఏరా?' అని పిలిపించుకోవడమా? అని.

* * *

సంధ్య దీపాలు వెలిగిస్తూనే భక్తులు ఒకరి వెనుకగా ఒకరు వస్తున్నారు. అందులోనూ ఇవాళ శనివారం. భక్తుల రాక ఎక్కువే.

అనసూయమ్మ పిన్నికి ఆవిడ తెచ్చిన ప్లాస్టిక్ బుట్ట గుర్తుపెట్టుకొని అందులో జుట్టున్న కొబ్బరి ఒప్పు, దేవుడిమీది పూల దండ ఒకటి తీసి ఉంచి, అందిస్తూ యధాలాపంగా ముఖద్వారం వైపు చూచాడు శ్రీమాలి. ఒక నడివయసు మహిళా, ఆవిడ ననుసరిస్తూ, పేమ్ బుట్ట పట్టుకొని పద్దెనిమిదీ, ఇరవయ్యేళ్ళలో ఉండే ఒక యువతీ ఆలయం మెట్లు ఎక్కివస్తూ కనిపించారు. ఆ పెద్దావిడ పింజపోసి చీరకట్టింది. 'ఎవరో బ్రాహ్మలే, ఈ గుడికి రావడం కొత్త!' అనుకొన్నాడు శ్రీమాలి. సాధారణంగా ఈ గుడికి పరిచయమున్న పాత భక్తులే వస్తుంటారు.

ఆ యువతి బుట్ట గర్భ గుడిగడపమీద పెట్టి, గంట గణగణా మ్రోగించి, ఒక్కసారి కళ్ళు మూసుకొని మ్రొక్కి, కళ్ళు తెరిచింది. ఎదురుగా—విశాలమైన వక్షంమీద ఆచ్ఛాదనేదీలేకుండా, పచ్చని పసిమిఛాయతో, బలిష్ఠమైన భుజాలతో, మనిషి దృఢంగా ఎత్తుగా హృదయరంజకంగా కనిపిస్తూన్న పూజారి యువకుడికేసే ఆవిడ చూపులు అతుక్కుపోయాయి. ఆలయంలో మూర్తిని చూడాలని, ఆయన రూపును దర్శించుకోవాలనీ స్పృహే, కలుగలేదు! బుట్టలోంచి కొబ్బరికాయ తీసి ఎప్పుడు కొట్టాడో, ఏం చేశాడోగాని. "తీసుకోండి" అంటూ, పూజారి హారతి ముందుకు తెచ్చేప్పటికి తృళ్ళిపాటుతో ఈ లోకంలో పడింది.




"అద్దెకు ఇక్కడ ఇళ్లు దొరుకుతాయని విన్నాను. ఉన్నాయా, బాబూ?" వృద్ధస్త్రీ ప్రశ్నించింది.

"ఆఁ. ఒకటి ఖాళీగానే ఉంది. ఆ ఎదురుగా ఉన్న ఇంట్లో మా బామ్మ ఉంది, ఆమెను కలుసుకోండి." బుట్టలో కొబ్బరి ఒప్పు, దేవుడిమీది పూలమాల బుట్టలో ఉంచి ఆ పిల్ల చేతికిస్తూ క్షణంసేపు ఆపిల్ల ముఖంలోకి చూసాడు శ్రీమాలి. మెరుపు తీగలు, పూల తీగలు, గులాబీల సౌందర్యం ఎన్నో. ఎన్నో స్ఫురించా యతడి కా క్షణంలో. మంచి పొడగరి పొడుపుకు తగిన అంగసౌష్ఠవం లేదుకానీ, ఉంటే అద్భుత సౌందర్యవతి అయ్యేదేమో? బక్కపలుచగా ఉంది. నాజూకుగా కనిపిస్తూంది. కను ముక్కుతీరు తీర్చిదిద్దినట్టుగా ఉంది.

"బామ్మగారు!"

"ఎవరూ?" అంటూ ఇవతలికి వచ్చింది బామ్మ.

"ఇక్కడ ఇల్లేదో ఖాళీగా ఉందని...."

తాళంచెవులు తీసుకువచ్చి ఇల్లు చూపింది బామ్మ. ముందు కొంచెం పెద్దగది. ప్రక్కకు మరో రెండు చిన్న గదులు-అంతే ఇల్లు ముందు వరండావున్నా ఆ ప్రక్కనే వున్న మరో మూడు వాటాలకు కలిసే ఉంటుంది. లెట్రిన్, బాత్‌రూం-అందరి మధ్యా ఉంటుంది.

ముసలామె చెప్పిన అద్దెకూ, ఇంటి వసతికీ సరిపోగా-"ఏదో-మధ్య తరగతి కుటుంబాలవాళ్ళం....ఉన్నంతలో సరిపెట్టుకోవాలి మరి.... రేపొస్తాం ఇంట్లోకి. పిన్నిగారూ!" అందావిడ.

ఎక్కడినుండి వస్తున్నారు, ఏమిటి—వివరాలన్నీ అడిగింది బామ్మ.

తనతో వచ్చిన అమ్మాయి కాత్యాయని పంతులమ్మ పని చేస్తూందని, ఆపై వీధిలో ఉంటున్నామని, ఇంటావిడ సాధింపులు, పోరుపడలేక ఇల్లు మార్చవలసి వచ్చిందని, తన పేరు కౌసల్యమ్మని, కాత్యాయనికి అమ్మమ్మననీ చెప్పింది ఆవిడ.

"వైదీకులా? వ్యాపారులా?"

"వైదీకులమే. ఈ పిల్ల తండ్రి తాత గారూ అంతా పౌరోహిత్యమే చేస్తుంటారు."

"అదే. బ్రాహ్మలకైతేనే ఇల్లు ఇస్తాను. నీచు తినేవాళ్ళకూ, శూద్రులకూ ఇల్లు ఎలా ఇస్తాం, కౌసల్యమ్మా? మనకూ వాళ్ళకూ ఎక్కడ కలుస్తుంది? దేవుడున్న చోటాయే!" అన్న బామ్మకు భళిగా—

"అవునవును. ఆ వాసనలూ అవీ మన కెక్కడ పడతాయి? ఇల్లు కూడా గలీజుగానే ఉంచుతారు. మనకు పొద్దున లేస్తే శుచీ శుభ్రం, మడీ ఆచారం కావాలి!" అంది కౌసల్యమ్మ "గుళ్ళో ఉన్నబ్బాయి మీ మనుమడా?"

"మనుమడే. కొడుకూ, కోడలూ

అర్ధాయుష్యం పోసుకొని వాడి చిన్నతనం లోనే పోయారు. నేనే వాడిని కంటికి రెప్పలా పెంచుకొస్తున్నాను.''

'ఇంకా పెంచుతున్నారా?' కొంటెనవ్వు కాత్యాయని పెదవులమీద నర్తించింది.

* * *

ఒకరోజు సాయంత్రం ఆలయం వెనకుండే తోటలో (ఓరెండురకాల మల్లె పందిళ్లు, ఓ మందారంచెట్టు, ఓపారిజాతంచెట్టు, ఓ రేవగన్నేరుచెట్టు - అదేతోట) ప్రవేశించి చెట్లను చూస్తున్న కాత్యాయనిని కేకేసింది బామ్మ ''ఆచెట్లమీద చెయివేయకు, పిల్లా! ఆపూలు దేవుడికి పెట్టేవి!''

''జాజి చాలా పూసిందికదా, బామ్మగారూ? కోసి, దేవుడికి మాలకట్టేదా!''

''దేవుడికి మాలకట్టేటయితే కొయ్యి'' అనుమతి ప్రసాదించింది బామ్మ.

వర్షర్తువు. ఈ సంవత్సరం దండిగా వర్షాలు పడుతున్నాయి. ఉన్న నాలుగు మొక్కలూ ఏపుగా, గోముగా పెరిగి, పచ్చగా ఆరోగ్యంగా అగుపడుతూ అది చక్కని తోటలా మనసుకు హాయినిస్తుంది. జాజి నిండుగా గుత్తులు గుత్తులుగా మొగ్గలు వేసింది. నాటినుండి కాత్యాయనికి నిత్య కృత్యమై పోయింది, జాజిపూలుకోయడం, ఓపికగా మాలకట్టడం.

''అబ్బా! మీ కాత్యాయనికి ఎంత భక్తో, ఎంత ఓపికో!'' అంటూ కౌసల్యమ్మ దగ్గర మెచ్చుకోకుండా ఉండలేక పోయింది బామ్మ. కౌసల్యమ్మకూ, బామ్మకూ, వచ్చిన నాలుగు రోజులలోనే మంచి దోస్తీకుదిరింది. ప్రక్క వాటాల్లో ఉండే వాళ్ళకూ, బామ్మకూ అంతగా పడదు. ఇల్లుగలవాళ్ళు ఇంట్లో ఉండే వాళ్ళను ఎలా సాధిస్తారో అలా సాధిస్తూంటుంది బామ్మ. అందుకే వాళ్ళకు బామ్మంటే కోపం. ఆవిడవాళ్ళకు మహంకాళి. ఇదివరలో అద్దెకు వచ్చిన వాళ్ళంతా వారం పదిరోజులు స్నేహంగానే ఉన్నారు బామ్మ గారితో. తరువాత వాళ్ళ రంగో,బామ్మరంగో బయట పడి ఉండాలి. ఈ క్రొత్తస్నేహం మూడు నాళ్ళముచ్చటేనేమో? అలా కావాలనే ఎదిరి చూస్తున్నారు ప్రక్క వాటాల్లోనివాళ్లు.

రోజూ తనుకట్టిన మాల శ్రీమాలి చేతులతో గుళ్ళో ఆనల్లవాని మెడలో అలంకృతం కావడం—నల్లని మెడలో విచ్చిన, తెల్లని మల్లెలమాల ఆమూర్తికి వింత కళను ప్రసాదిస్తూంటే తృప్తిగా చూచుకొంటుంది కాత్యాయని.

* * *

''బామ్మగారూ!''

''ఊఁ'' ఆయాసంగా మూల్గింది బామ్మ.

''అమ్మమ్మ తాళంచెవులు మీకిచ్చి పోయిందా!....సుస్తీచేసిందాఏమిటి,బరువుగా ఉన్నారు?''

''జలుబు చేసిందమ్మా, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు....తాళంచెవి ఆగూట్లో ఉంది చూడమ్మా....పుస్తకాలు ఇంట్లోపెట్టి కాళ్ళు మొహం కడుక్కొని కొంచెం యిలా వస్తావా, కాత్యాయనీ? కాస్త వేడివేడి చాయ్ పడితే తలభారం కాస్త తగ్గుతుందేమో?'' ఆయాసంగా పొర్లింది బామ్మ.

''అలాగేనండీ.''

పుస్తకాలు ఇంట్లోపడేసి, గబగబా చీర మార్చి ముఖంకడుక్కొని, తలుపులు చేరవగా వేసి వచ్చింది కాత్యాయని. బామ్మగారి వంటగది, దేవుడిగది ఒకటే. తలుపులు తెరిచిలోనికి వెడుతుంటే కాత్యాయని కాళ్ళు కొద్దిగా వణికాయి. కొద్దిక్షణాలు ఏమీ తోచనట్టుగా నిలబడి పోయింది. గది చుట్టూతా చూస్తూ, పిల్లా, పీచూలేని ఇల్లేమో-ఎక్కడ సర్దినసామాను అక్కడ పొందికగా ఉంది. అద్దంలా కడగబడిన బండల్లో వెలుగు తన ముఖం చూచుకొని మురిసిపోతూంది. బోర్లించిన గిన్నెలపై మసీ, మరకా లేకుండా తళతళలాడుతున్నాయి. ఉదయంచేసిన వంట పొయిల ప్రక్కగా మూసిపెట్టి ఉంది. ఇంత వృద్ధాప్యంలో కూడా బామ్మగారిలోని గృహిణిత్వానికి ముగ్ధురాలైంది కాత్యాయని. అసలా మనిషిని చూస్తేనే ఓపవిత్రభావం కలుగుతుంది. ఎప్పుడూ తెల్లనిసైను పంచలో, తెల్లగా పండిపోయిన తలతో, తెల్లని మేని చాయతో శుచిశుభ్రతలకు ప్రతి రూపంగా అగుపడు తూంటుంది.

బామ్మ అవతలినుండే నీరసంగా చెప్పింది—బొగ్గులు కుంపట్లోపోసి రాజేయమని, పంచదార డబ్బా, టీ పొడిడబ్బా,పాలూ ఫలానాచోట ఉన్నాయని. పది నిమిషాల తరువాత టీ గ్లాస్‌తో ఇవతలికి వచ్చింది కాత్యాయని.''నిప్పుటున్నాయి, బామ్మగారూ! ముఖానికి అమృతాంజనం రాచుకొని సెగ కాచుకొంటారా? కుంపటి తీసుకురానా?''

''నీ కడుపు చల్లగా! తీసుకురా, తల్లీ! అమృతాంజనం ఆ గూట్లో ఉంది చూడు!''

గూట్లోంచి అమృతాంజనం తీసి, బామ్మగారి కణతలకూ, ముక్కుకూ బాగా మర్దించింది కాత్యాయని. బామ్మ నిప్పుల కుంపటి మీదికి ముఖం వంచి, ''బాగా మాగి తొడిమనుండి రాలిపోవడానికి సిద్ధంగా ఉన్న పండు ఇది. ఏక్షణమో? ఏగడియో? భగవంతుడి పిలుపుకు నేను తయారుగా ఉన్నాను, అమ్మడూ! కాని, ఒక్కటే కోరిక....తల్లీ తండ్రి లేని బిడ్డను ఈ చేతులమీదుగా పెంచాను. వాడినో ఇంటివాడిని చేస్తే చాలు ఇహ నాకే కోరికలూ లేవు!''

''.......'' మీ మనుమడు ఎక్కడికెళ్ళాడన్న ప్రశ్న కాత్యాయని గొంతుకలో చాలాసేపటినుంచి కొట్టుకొంటూంది. కాని, ఆవిడేమైనా అనుకొంటుందేమోనని ఆగిపోయింది. రోజంతా అడపాదడపా ఒకరికంట ఒకరు పడుతూనే ఉంటారు. చూచినా చూపులు త్రిప్పుకొని వెళ్ళిపోతుంటాడు శ్రీమాలి, చాలా బుద్ధిమంతుడైన కుర్రాడిలా. ఎక్కడ కలువకపోయినా రాత్రి గుళ్ళో పూలదండ ఇవ్వడానికి వెళ్ళినప్పుడు సమీపంగా కలుసుకొంటారిద్దరూ. అతడిని మాట్లాడించా లనుకొంటుందిగాని, సంకోచంతో ఆగిపోతుంది కాత్యాయని. మాట్లడడానికి ఏముంటుందన్నట్టుగా అతడూ ఏమీ మాట్లాడడు. చూచినా ఆ చూపుల్లో ఏఅర్థాలు కల్పించుకొందామన్నా ఆస్కారముండదు.

బొమ్మగారు మనుమడి స్వభావం, అతడి నడవడీ, అవీ ఇవీ—అక్కడక్కడా సంఘటనలు ఉటంకిస్తూ చెప్పుకొస్తూంది. మౌనంగా ఆలకిస్తూంది కాత్యాయని, ఆవిడ నడుములు పడుతూ.


''వాడికి సంబంధాలు కూడా చాలానే వస్తున్నాయి. కొన్ని నాకు నచ్చకా, కొన్ని వాడికి నచ్చకా దాటిపోతున్నాయి. మొన్నామధ్య మహబూబ్ నగరంవాళ్ళు కబురు చేశారు పదివేల కట్నమిచ్చి, పై చదువులు చదివే ఉద్దేశం ఉంటే సహాయపడగలమని. కాని, నాకూ వాడికీ కూడా ఇష్టంలేదీ సంబంధం. వియ్యానికైనా కయ్యానికైనా సమఉజ్జీలు కావాలంటారు. నాస్థితిగతులేమిటో నాకు తెలుసు. ఏదో, కష్టపడి చదివించుకొన్నాను వాడిని. ఆ చదువు తప్ప మాకు చెప్పుకోడానికి ఏముంది చెప్పు? బలిసినింటిపిల్లను తెచ్చుకొంటే కుమ్ములాట తప్ప మరేముంది? కలిమికి ఆశపడి మనశ్శాంతినీ, మనసు తృప్తినీ దూరం చేసుకొంటామా?'' అని చెప్పి, చివరికి ''నీలాంటి అమ్మాయి నా మనుమడికి భార్యగా రావాలే, అమ్మడూ'' అనేసింది.

కాత్యాయని చెంపల్లోకి రక్తం చివ్వున చిమ్మింది. ముఖం ప్రక్కకు త్రిప్పుకొంది, అరవిరిసిన పెదవులు బామ్మగారి కంట పడకుండా.

''పొలంకౌలు గురించి ప్రక్క గ్రామం వెళ్ళాడు మనూ. ఈ వేళకు రావలసినవాడే. రాలేదెందుకో?.... నిండా నూరేళ్ళ ఆయుష్యంరా,నాయనా! ఇంకా రాలేదెందుకోఅని—నీ మాటే అనుకొంటున్నాను.'

గడపలో జోళ్ళు విడిచిన శ్రీమాలి అక్కడి దృశ్యం చూచి కంగారు పడ్డాడు. ''ఏమైంది, బామ్మా? ఏమిటి.''

బామ్మ చెప్పి. 'నువ్వు దబ్బున పెళ్లాన్ని తెచ్చుకోవాలిరా, మనూ! ఏదో, దయగల పిల్ల కాబట్టి ఈ పిల్ల వచ్చి చాయ్ చేసిచ్చి అదీ ఇదీ చేసిందికాని, ఈ ముసలిముండను




ఎవరు పలుకరిస్తారు చెప్పు?

బామ్మది జలుబు బాధేనని తెలిసి తేటపడ్డ శ్రీమాలి చిన్నగా నవ్వేశాడు. గోముగా, అమాయకంగా, ''ఎక్కడుందో చెప్పు, బామ్మా, పెళ్ళాం! వెళ్ళి తెచ్చుకొంటాను,'' అన్నాడు.

బామ్మ మెడ ప్రక్కనుండి ఓరగా చూస్తూన్న కాత్యాయని, తననే చూచి నవ్విన అల్లరి నవ్వుకు, చటుక్కున తల క్రిందికి దాచుకొంది.

షర్ట్ విడిచి కాళ్ళు కడుక్కోడానికి పెరట్లోకి వెళ్ళాడు శ్రీమాలి.

''ఆయనకు టీ చేసివ్వనా, బామ్మగారూ?''

''నాతల్లే! చేసివ్వమ్మా. ప్రొద్దున నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని వెళ్ళాడు. స్కూల్‌నుండి వచ్చాక నువ్వూ తీసుకోలేదు కదా? నీకూ ఓ కప్పు పెట్టుకో.''

బామ్మ ముందున్న నిప్పుల కుంపటి బూడిద దులిపి లోపలికి తీసికెళ్ళి బొగ్గులు వేసి చెయి కడుక్కొంటూంది కాత్యాయని. శ్రీమాలి వంటింటి గడపకవతలే సంకోచంగా ఆగిపోయాడు. 'కొంచెం మంచినీళ్ళిస్తారా?'

చెంబులో నీళ్ళు నింపి, గ్లాసూ చెంబూ అతడి చేతి కందిస్తూంటే కాత్యాయని చేతులు కాస్త వణికాయి. తల నెవరో బిగించి క్రిందికి కట్టినట్టు పైకి ఎత్త లేకపోయింది. తన అసహాయత కనిపెట్టి అతడు తననే పరీక్షగా, నఖశిఖ పర్యంతం పరికిస్తూండడం కాత్యాయని కనిపెట్టక పోలేదు.

'టీ తీసుకోండి.''

వస్తూ వస్తూ తనతో తెచ్చుకొన్న న్యూస్ పేపరులో తల దూర్చేసి కూర్చొన్నాడు శ్రీమాలి. ముఖానికి పేపరు అడ్డం తీయకుండానే పేపరు అంచులనుంచి ఆమెను ఓరగా గమనిస్తూ చెయి చాచాడు.

''ఇదేమిటి? ఈరోజు యిలా చూస్తున్నాడు?'' బెదురుగా అనుకొంది కాత్యాయని.

''మీ రివాళ చాలా శ్రమ తీసుకొన్నారు మావల్ల!''

''అబ్బే! నేనేం శ్రమ అనుకోవడం లేదు!''

టీ చేసిన గిన్నెలవీ శుభ్రంగా కడిగి బోర్లించేసి, మూలనున్న చీపురుకట్ట తీసుకొని సంధ్యకసవు ఊడుస్తూన్న కాత్యాయనిని చూచి శ్రీమాలి మనసులో ఎలాంటి ఊహలు వచ్చాయో గాని—కుచ్చిళ్ళ పైకి చెక్కి, కొంగు నడుములో దోపి పొందికగా యిల్లు చిమ్ముతూన్న కాత్యాయనిని కాళ్ళకు మట్టెలతో, మెడలో నల్లపూసలతో ఈ ఇంటి కోడలిగా, తన ముద్దుల మనుమడి అర్ధాంగిగా ఊహించుకొని ఏ లోకంలోనో విహరించసాగింది బామ్మ. ''రాత్రికి నాలుగ్గింజలు కడిగి వాడు కుంపటిమీద వేసుకొంటాడు గాని

నువ్వెళ్ళమ్మా. మీ అమ్మమ్మ కోప్పడగలదు!''

''ఛ! ఆవిడేం కోప్పడదండీ! ఒకరికొకరి సాయం!''

''ఎంత మంచి పిల్లా? ఎంత మంచి పిల్లా?''

* *

జలుబు భారం తగ్గిన తరువాత ఒకనాటి మధ్యాహ్నం కాస్సేపు నడుం అలా వాల్చి దేవుడి వత్తులు చేయడానికి కూర్చొంది బామ్మ.

''పిన్నిగారూ! వత్తులు చేస్తున్నారా?'' అంటూ వచ్చి కూర్చొంది కౌసల్యమ్మ.

''కూర్చో, కౌసల్యమ్మా!''

పత్తి అందుకొని గింజలు తీసేస్తున్న కౌసల్యమ్మతో ఆ మాటా ఈ మాటా ముచ్చటిస్తూ గోత్రాలనూ, బంధుత్వాలనూ వెలికి తీయసాగింది బామ్మ. కాని, ఎక్కడా వాళ్లకూ వీళ్లకూ బంధుత్వమున్నట్టు బయటపడలేదు. ''ఆఁ. ఈ కాలంలో బంధుత్వాలే కలవాలనే ఏముంది? మన శాఖ. మనకు సరిపడినవాళ్లు. పిల్ల గుణవతీ, రూపవతీ!'' సరిపెట్టుకొంది బామ్మ.

కౌసల్యమ్మ చెప్పిన మాటలనుబట్టి, తిండికీ బట్టకూ తడుముకోని సంప్రదాయికమైన మధ్యతరగతి కుటుంబం వాళ్ళది. కాత్యాయని తలిదండ్రులకు జేష్ఠ తనయ. అక్కడెక్కడో గుడిపూజారిగా ఉన్న తండ్రికి వేణ్ణీళ్ళకు చన్నీళ్లన్నట్టుగా కాత్యాయనిని ఎలిమెంటరీ టీచర్ ట్రెయినింగ్‌కు పంపి పంతులమ్మ పనిలో ప్రవేశపెట్టారు. సోరపిల్లను వంటరిగా ఎలా పంపించడమని అమ్మమ్మను తోడిచ్చి పంపారు. తలిదండ్రులకు ఆ పిల్ల పెళ్ళి బెంగ తీవ్రంగా వేధిస్తూంది. తరువాత చదువులకు, పెళ్ళిళ్ళకు ఎదిగివస్తున్న పిల్లలు!

మగదిక్కులేని తాను మనుమడిని పెంచుకు రావడంలో ఎదుర్కొన్న సమస్యలు, అనుభవాలనుబట్టి వాళ్ళ కుటుంబ సమస్యలను సానుభూతిగా విన్నది బామ్మ. విభూతి పండు మీద వేళ్ళరాచి ఒత్తి నలుస్తూ ''మీ కాత్యాయనిని నా మనుమడికి చేసుకొంటాను. ఇస్తారా, కౌసల్యమ్మా?'' అంది ముసిముసిగా నవ్వుతూ.

''మాకు అంత అదృష్టమా, పిన్నిగారూ?'' తబ్బిబ్బు పడిపోయింది కౌసల్యమ్మ.

''మీది అదృష్టం అవునో కాదో నేను చెప్పలేను కాని, కాత్యాయని మా ఇంట పడడం నిజంగా మా అదృష్టం. చదువుకొని ఉద్యోగం చేస్తున్నదైనా ఆవగింజంత గర్వం లేదు. పనీ పాటా, మాటా మర్యాదా—అన్నీ తెలిసిన పిల్ల. మీరు వరకట్నంకోసంకూడా బెంగపడక్కర్లేదు. పిల్లే మాకు పదిలక్షల పెట్టు!''

''మీ మనుమడి ఇష్టం కనుక్కొన్నారా?''

''ఆఁ. కుర్ర నాగన్న. ఇంత వయసొచ్చినా నా చేతుల్లో బిడ్డే. నేనెంత చెబితే అంత. అయినా నేను కుంటిపిల్లో గూనిపిల్లో చూపి పెళ్ళి చేసుకోమనడం లేదుగా? రత్నంలాంటి పిల్ల. మనూకు ఈడూ జోడైన పిల్ల!'' ఈ మధ్య బామ్మగారికి ఆ పనీ ఈ పనీ చేసిపెడుతూ ఆవిడ మనసు పూర్తిగా దోచేసింది కాత్యాయని.

ప్రక్కగదిలో పడుకొనివున్న శ్రీమాలి వీళ్ల సంభాషణ అతి శ్రద్ధగా ఆలకించాడు. ''కాత్యాయని!'' కాత్యాయని నామాన్నీ, రూపాన్నీ అపురూపంగా ధ్యానించసాగాడు.

* *

అడపా దడపా కాత్యాయని ఈ ఇంటికి రావడంవల్ల, ఇంటిపిల్లలాగే ఆ పనీ ఈ పనీ చేసిపెట్టడంవల్ల బామ్మగారికి చాలా ఆత్మీయమైపోయింది. ఈ ఇంట్లో కాత్యాయని తరుచుగా మెదలడంవల్ల శ్రీమాలికీ సన్నిహితమైంది. కథలగురించీ, సినిమాలగురించీ. పత్రికల్లో వార్తలగురించీ ముందుముందు పొడిపొడిగా మాట్లాడుకొన్నా ఇప్పుడు అరమరిక లేకుండా మాట్లాడుకొంటున్నారు. వీళ్ల స్నేహానికి ప్రోత్సాహకరంగా ఇటు బామ్మగారివీ, అటు అమ్మమ్మగారివీ మాటలు ఉండనే వున్నాయి!

ఒక సాయంత్రం దొడ్లో జాజిపూలు కోస్తూంది కాత్యాయని. దేవగన్నేరు పువ్వొకటి వచ్చి ముఖానికి కొట్టుకొంది. చెట్టునుండి గాలికి రాలి వచ్చిపడిందేమోనని మరో విధంగా అనుమానపడలేదు. ఈసారి పారిజాతం పువ్వులు గుప్పెటతో విసిరినట్టు మీద వచ్చిపడ్డాయి. అప్పుడు దిక్కులు చూచింది కాత్యాయని. ఎవరూ కనిపించక కంగారు పడింది. ''ఎవరు? ఎవరు?''

''గుళ్ళోవున్న గోపాలుడు వచ్చాడు—ఈ నందనవన విహారానికీ, ఈ రమణీమణితో ఊసులాడటానికీ!''

అటువైపు దేవగన్నేరుచెట్టు మాను వెనుకనుండి వినవచ్చాయా మాటలు.

''మీరా?'' ఏదో మధురానుభూతి గుండెల్లో నిండిపోయింది.

మాను ప్రక్కనుండి పందిరి సమీపానికి వచ్చాడు శ్రీమాలి.

''మీ చిలిపితనం చల్లగా ఉండనీ కాని, ఇదేమిటి మీ రాక? ఎవరైనా మనల్నిలా చూస్తే ఏమనుకొంటారు?''

''ఏమనుకొంటారు?''

''అబ్బా! కుర్ర నాగన్నలు! ఏమీ తెలీదు పాపం!''

''మా బామ్మనడుగూ—నాకేమైనా తెలిసేమో?''

''అలాగేం?'' మూతి త్రిప్పింది తమాషాగా. ఇంతకి మీ రొచ్చిన పని....

''నీతో ఒకసంగతి మాట్లాడాలని....''

''చెప్పండి, తొందరగా. ఎవరైనా చూస్తే బాగుండదు. నేనైనా వెడతాను. మీరైనా వెళ్ళిపొండి.''

''అంత తొందరగా చెప్పే సంగతి కాదు.''

''అయితే ఇంట్లోకి వచ్చాక చెప్పండి.''

''అహఁ. మా ఇంట్లో మాబామ్మా.... మీ ఇంట్లో మీ అమ్మమ్మా. మనం ఏకాంతంగా కూర్చొని మన పెళ్ళి సంగతులు మాట్లాడుకొందాం.''

''మన పెద్దవాళ్లు మాట్లాడుతున్నారుగా?''

''—తున్నారనుకో. కాని మనంకూడా మాట్లాడుకోవాలిగా? మనసు విప్పి యింకా

ఏదేదో మాట్లాడాలని ఉంది. నువ్వు ఊఁ అంటే—''

''—అంటే?''

''రేపు సాయంత్రం, పబ్లిక్ గార్డెన్స్‌లో....'' పందిరి కవతలివైపునుండి చేతులు జాపి, కాత్యాయని బుగ్గలు మృదువుగా నిమిరాడు శ్రీమాలి.

ఓరగా, సిగ్గుగా చూచింది కాత్యాయని. ''మీకో ముఖ్యమైన సంగతి చెప్పేది ఉంది. నాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డరు వచ్చిం దీ రోజు. రేపు అమ్మావాళ్ళ దగ్గరికి వెళ్ళి రెండుమూడు రోజులుండి తిరిగి వచ్చి ఛార్జీ ఇచ్చేసి వెళ్ళిపోవాలి.''

''నిజం?'' ఏదోలా అయిపోయాడు శ్రీమాలి.

''అబద్ధమెందుకూ?''

''అయితే, మనం ఏకాంతంగా కలుసుకొని మాట్లాడడం ఇంకా అవసరమన్నమాట. రేపొక్కనాడు నాకోసం ఉండిపో. తప్పకుండా రేపు సాయంత్రం....పబ్లిక్ గార్డెన్స్‌లో....''

అలాగే నన్నట్టుగా తలూపింది కాత్యాయని.

* *

కాత్యాయనికి బదిలీ అయిందని తెలిసి బామ్మ తలక్రిందులైపోయింది. 'ఇంత హఠాత్తుగా వెళ్లిపోతున్నదా, కాత్యాయని?' చాలా నీరసపడిపోయిం దావిడ. కాలుగాలిన పిల్లిలా నాలుగైదుసార్లు కౌసల్యమ్మ వాటాలోకి తిరిగింది. ''మీ కాత్యాయనిని మా మనూకు ఇచ్చే సంగతి మరిచిపోతావా, ఏం?''

''మీరు మరిచినా మేం మరుస్తామా, పిన్నిగారూ? ఆడపిల్ల బరువు మోస్తున్నవాళ్ళం. వెళ్ళాక మంచిరోజు చూచుకొని మా కాత్యాయని తలిదండ్రులను పంపిస్తాను. నేను ముందే చెబుతున్నాగా? ఎక్కువగా కట్న కానుక లిచ్చేస్తోమత లేదు వాళ్ళకు. పచ్చిపులుసన్నంపెట్టి పెళ్ళి చేసేస్తారు.''

''నేను మాత్రం ఏం కోరానే, కౌసల్యమ్మా? పిల్ల మా ఇంటికి రావడమే పదివేలు!''


సామానంత కట్టేసి సాయంత్రం ప్రయాణం పెట్టుకొన్నారుగాని ఆ రాత్రి బామ్మ భోజనానికి ఆహ్వానించింది. ఈరాత్రికుండి తనింట్లో భోంచేసి మరునాడు వెళ్ళిపొమ్మని మరి మరీ బలవంతం చేసింది. కాదనలేక ఆగిపోయారు కాత్యాయనీ వాళ్లు.

* *

సాయంత్రం కావడంకోసం క్షణమొక యుగంగా ఎదిరి చూచాడు శ్రీమాలి. నాలుగవుతూంటే కొంచెం ప్రత్యేకంగా తయారయ్యాడు. జరీ అంచున్న ఇస్త్రీ ధోవతి కట్టి, తెల్లని షర్ట్ వేసుకొని, మామూలుకంటే కాస్సేపు ఎక్కువగా అద్దంముందు నిలబడి క్రాప్ పదే పదే సవరించుకొని, జోళ్లు వేసుకొని ఇవతల పడ్డాడు. కాత్యాయని వాళ్ళ గుమ్మంముందు ఆగి, ద్వారబందాలమీద రెండు చేతులూ మోపి నిలబడ్డాడు. సామానంతా కట్టేసినట్టున్నారు వాళ్లు. పది, పద్నాలుగేళ్ళ కుర్రా డొకడు లగేజీ లెక్కపెడుతున్నాడు.

''మా తమ్ముడు. అనుకోకుండా వచ్చాడు వీడు. సామానంతా వీడివెంట పంపేసి రేపు ఉదయం మేం వెళ్లిపోతాం.''

రిక్షాలు పిలువడానికి బయటికి వెళ్ళాడు కాత్యాయని తమ్ముడు.





కౌసల్యమ్మ లోనికి వెళ్ళగా చూచి కన్నుకొట్టాడు శ్రీమాలి.

కాత్యాయని లోపలి గుమ్మం వైపు భయంగా చూచింది. గుండెలమీద చెయ్యి వేసుకొని, తరువాత, వస్తానన్నట్టుగా తలాడించింది.

గొంతు తగ్గించి చెప్పాడు శ్రీమాలి. ''నేను ముందు వెడతాను. తరువాత ఏ ప్రెండింటికనో చెప్పి నువ్వు బయటపడివా. పబ్లిక్ గార్డెన్స్‌లో నీకోసం ఎదిరి చూస్తుంటాను.''

''అలాగే!'' భయంగా, కంగారుగా ధ్వనించింది కాత్యాయని గొంతుక.

ఉత్సాహంగా ఇవతలికి వచ్చాడు శ్రీమాలి. దారిపొడువునా అతడి హృదయం చిత్రమైన ఊహలతో నిండిపోయింది. ప్రేమ అన్నది ఎంత తీయటి అనుభూతి? ఇలా ప్రేమ ప్రమాదంలో పడిపోగలడని ఎన్నడైనా అనుకొన్నాడా? కాత్యాయని లాంటి అందాలరాసి, సుగుణాల ప్రోవు ఈవిధంగా తన జీవితంలో తారసపడుతుందని కలగన్నాడా? ఏదో సంబంధం వస్తుందని, ముక్కు మొహం కాస్త చక్కగున్నదాన్ని చూచి అంగీకారం తెలుపడం, బామ్మ రాజముద్ర వేయడం, తనో ఇంటివాడు కావడం—ఇంతే అనుకొన్నాడు గాని తనూ ప్రేమించి పెళ్ళాడగల మగధీరుడౌతాడని ఎన్నడూ ఊహించలేదు.




పెళ్ళికి ముందు ప్రేమించడం, ప్రేమించిన స్త్రీని ఏకాంతస్థలంలో కలుసుకోవడంలో ఓ చిత్రమైన కంపనం, హాయి ఉన్నాయి కదూ?

గార్డెన్ చేరాక గేటుదగ్గర వచ్చీ పోయే వాళ్ళను చూస్తూ పచార్లు చేస్తూ క్షణం పది యుగాలుగా గడపసాగాడు శ్రీమాలి. 'ఏమైంది? ఇంకా రాదేం?' నిరీక్షణలో గంటా రెండుగంటలు గడిచిపోయాయి. ఎండవేడి తగ్గించుకొంది. విసుగ్గా అసహనంగా కాత్యాయని వచ్చే దారివైపు చూడసాగాడు. చెట్లమీద నీరెండహృద్యంగా పరుచుకొంది.

"హలో! ఇక్కడ ఉన్నావేం!" జబ్బమీద పడిన దెబ్బకు ఇటు తిరిగాడు శ్రీమాలి. రవీంద్ర!

"ఏం తోచక వచ్చామురా!"

"అయితే అక్కడ కూర్చుందాం పద." రెక్కపట్టి గుంజుకు పోయాడు రవీంద్ర.

వాడు ఈ సమయంలో ఇక్కడ దాపురించడం చూస్తుంటే మంటగా, చిరచిరగా ఉంది. 'శని మొహం!' అని తిట్టుకోసాగాడు. ఏదో పలుకరిస్తున్నాడు రవీంద్ర. శ్రీమాలి చూపులూ, మనసూ కాత్యాయని వచ్చేదారి మీదే ఉన్నాయి. నీరెండ కూడా అదృశ్యమై నీడలు బారలు చాపుతూ వచ్చిపడుతున్నాయి. సంధ్యాకాంత అవతరించి పక్షిజాలాన్ని గూళ్ళకు ఆహ్వానిస్తూంది. చుట్టూ రకరకాల మొక్కలు చక్కగా పూలు విరిసి కమ్మని పరిమళాల్ని వెదజల్లుతున్నాయి. సంధ్యవేళ విరిసిన పూలమీద తుమ్మెద ఝుంకారాలు— ఓ హృద్యమైన దృశ్యం చల్లటిగాలి; చక్కటి వాతావరణం. ఈ సమయంలో కాత్యాయనితో గడపడం ఎంత చక్కటి అనుభవం? ఎందుకురాలేదు చెప్మా? వెలుగుండగా వస్తే ఎవరైనా చూస్తారని సంకోచమా? ఇప్పుడైనా రావచ్చు కదా?

"అదిగో. మన వాళ్ళంతా వచ్చేస్తున్నారు!" ఇక్కడున్నాం — అన్నట్టుగా చెయ్యెత్తి సైగ చేశాడు రవీంద్ర.

తృళ్ళిపడి చూచాడు శ్రీమాలి. రాజారాం, శివనారాయణ, మురళి ఏదో మాట్లాడుకొంటూ యిటే వస్తున్నారు. వాళ్ళవెనుక కొంచెం దూరంగా భుజాల నిండుగా కొంగు కప్పుకుని తలొంచుకుని వస్తూంది కాత్యాయని.

గుండె చిత్రంగా పట్టుకుంది శ్రీమాలికి. "ఇప్పుడెలా కాత్యాయనితో మాట్లాడడం? ఈ వెధవలు యిప్పుడే వచ్చి చావాలా?"

"ఎవరా సువర్ణసుందరి? ఓ!" లొట్టలు వేస్తూన్న రవీంద్రను చూచి గూబగుయ్యి మనేలా తన్నేయాలనిపించింది శ్రీమాలికి. కాని, ఎలా బయట పడిపోవడం?......" ఆవిడెవరనుకున్నావురా, గాడిదా! నా కాబోయే భార్య—అని చెప్పేస్తే? వెధవ మొహం చింతాకంత కాదూ?" రవీంద్ర చెవిని గట్టిగా పట్టుకొన్నాడు.

"ఏమిటి గురూ విశేషాలు?" అంటూ సమీపించాడు శివనారాయణ. మురళి వచ్చి శ్రీమాలి ప్రక్కనే చతికిలబడ్డాడు. రాజారాం ఎదురుగా కూర్చున్నాడు. కొంచెం దూరంగా ఆగిపోయిన కాత్యాయని సంకోచంగా, బెరుగ్గా చూస్తూ కొంగు మెలి త్రిప్పుతూంది.

"రా కాత్యాయనీ, వీళ్ళు నా ప్రాణ మిత్రులు."

రెండడుగులు ముందుకు వేసింది కాత్యాయని.

"ఈ విడ పేరు కాత్యాయని. టీచరుగా ఉంటూంది. మా వాటాల్లోనే ఉంటున్నారు." కొంచెం సిగ్గు తెచ్చేసుకొని, "కాబోయే భార్య కూడా. మేం ప్రేమించుకొన్నాం." అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

ముట్టి చెయ్యి శ్రీమాలి పిలకను దువ్వుతూంది. రవీంద్ర శ్రీమాలిని వాటేసుకొని ప్రియుని శరీరంలో ఒదిగిపోయిన ప్రేయసిలా కూర్చుని ఉన్నాడు.

"ఓ!"గంభీరంలోనే కొంచెం వెటకరింపు మిళితం చేసి కాత్యాయనికేసి చూపు సారించాడు రాజారాం. "లామేరేజా! హీరో వయ్యావన్నమాట! కంగ్రాచ్యులేషన్స్! సక్సెస్ లేనా?"

"మరీ అంత గుడ్డి ప్రేమలో పడలేదులే. అంతకన్ను గానకుండా తిరిగేవాడిని కాదని తెలీదూ? మా వర్ణమూ, మా శాఖా!" సగర్వంగా చెబుతూన్న శ్రీమాలి. చెవులదగ్గర కత్తెర చక్ చక్ శబ్దం చేసింది. "రేయ్!" కంగారుగా ఎత్తిన చేతితో కత్తిరించిన పిలక భద్రంగా దాచబడింది.

మిత్ర చతుష్టయం పడిపడి నవ్వారు.

తెల్లబోయి చూస్తున్నాడు శ్రీమాలి.

"కస్తూరీ! కొంచెం యిలా రా, అమ్మా. మా మిత్రుణ్ణి ఫూల్ను చేసి మా కార్యక్రమంలో చాలానేర్పుగా సహకరించినందుకు మా బహుమానం!" వంద రూపాయల కాగితం ఎత్తి పట్టుకున్నాడు రాజారాం.

కస్తూరి రెండడుగులు ముందుకు వేసింది.

నోటువైపు తృణీకారంగా ఒక చూపు చూచి ముఖం తిప్పుకొంది.

"ఓ!" బరువుగా, దీర్ఘంగా మూలిగాడు శ్రీమాలి. "మీ కుట్ర నాకు అర్థమైంది. ఎవరీమె?"

"నాగవేణి—అంటే కౌసల్యమ్మ మనుమరాలు, కస్తూరి. బజారు పిల్ల!"

నల్లగా మాడిపోయింది శ్రీమాలి వదనం.

ఆత్రంగా గుండెలు చిక్కబట్టుకొని అతడి ముఖంలోకే చూస్తూంది కస్తూరి.


"ఇహ యిప్పుడు చెప్పు. నీ పరిశీలనా దృక్పథం గురించి. కస్తూరి, అంటే కాత్యాయని గురించి నీకు ఏర్పడిన అభిప్రాయం ఏమిటో చెప్పు!"

కాత్యాయని అందమైంది. నిండు హృదయం కలది. మంచి మనసుకలది. మా బ్రాహ్మణుల్లో కూడా ఈవిడకు మించిన విలక్షణమైన ప్రకృతిని నేను చూడలేదు." క్షీణ స్వరాన పలికాడు శ్రీమాలి.

"ముందే ఆమె నీకు భోగంపిల్లని తెలిపి ఉంటే—?'

"ఓడిపోయానురా?" రాజారాం భుజం మీద నీరసంగా చేయివేశాడు" అవును. ఆమె భోగంపిల్లని తెలిస్తే ఆ దృక్పథంతోనే చూసేవాడివి. ఆవిడ యెలా ప్రవర్తించినా వెకిలిగా, లేకిగా అర్థం చేసుకొనే వాడివేమో?"

"అదీ! గుణపాఠం నేర్చుకో, శాస్త్రీ! కులాల్నిబట్టి జీవితాల్నిబట్టి ఒక వ్యక్తిగురించి అభిప్రాయాలు ఏర్పరచుకోకూడదు. మనకై మనం ఒక విశాలదృక్పథం ఏర్పరచుకోవాలి. ఒకరిలోని లోపాల్నీ, పాపాల్నీ కూడా మనం లెక్కపెట్టుకోకూడదు. నీ కులంపట్ల నీకు గౌరవం ఉంటే నిన్నెవరూ ఆక్షేపించరు. కాని, ఆ అభిమానంతో ఇతర కులాలను చిన్నచూపు చూస్తేమాత్రం క్షంతవ్యంకాదు. కులాలనుబట్టి వ్యక్తిత్వాలను నిర్ణయించడం కంటే వ్యక్తిత్వాలనుబట్టికులాలను నిర్ణయించడం ఉత్తమం,లోకకళ్యాణమూ."రాజారాం సుదీర్ఘమైన వుపన్యాసానికి ఫుల్‌స్టాప్‌పెట్టి,




తిరిగి కస్తూరి వైపు తిరిగాడు. "తీసుకో, కస్తూరీ! నువ్వు చేసిన సాహసానికి ఇది చాలా తక్కువ వెలే అనుకో. కాని, అనుకొన్న దింతేకదా? అడ్వాన్స్‌గా ఏభై ఇదివరకే మీ అమ్మమ్మకు ఇచ్చాను. ఇప్పుడు వంద."

"క్షమించండి. నేను తీసుకోలేను. మీరిచ్చిన అడ్వాన్సు రూపాయలుకూడా తిరిగి ఇచ్చివేస్తున్నాను," కర్చీఫ్‌లో చుట్టిన రూపాయలు అతడి ముందుకు విసిరింది కస్తూరి. "బురదలో పందిలా జీవిస్తున్నా నిన్నాళ్లూ. రాజహంసలు విహరించే సరోవరాలుకూడా ఉన్నాయని చూపారు మీరు. ఒక విలక్షణమైన జీవితం పట్ల అపేక్ష అంకురింపబడడానికి ఆవకాశం కల్పించిన మీకు నేనే ఎన్నోవిధాల రుణపడి ఉన్నాను." కస్తూరి కళ్ళలో నిండుగా నీళ్లు నిండి మెరుస్తున్నాయి.

శ్రోతలు నిశ్చేష్టితంగా చూస్తుండిపోయారు.

"మరొక నాటకంలో పాత్రను నాకిచ్చారు, నటించలేదు నేను—జీవించానందులో. ఆయనను మోసం చేస్తూనే ఆరాధించాను. బజారుదాన్నయితే కావచ్చు. డబ్బుకు ఒళ్ళు నమ్ముకొనే వేశ్యయువతినే కావచ్చు. కాని, మానసికంగా ఇటువంటి పవిత్రమైన ప్రేమానుభూతికి నేను అనర్హురాలినని మీరు చెప్పగలరా! అందుకే.... అందుకే....ఆ జీవితంలో నేను చచ్చిపోయి పునర్జన్మ ఎత్తుతున్నాను. పవిత్రమైన జీవితం గడపడానికి ప్రయత్నిస్తాను. నేను చదివిన స్కూల్‌ఫైనల్ నా ప్రయత్నానికి సహకరించగలదనే ఆశపడుతున్నాను. దైవం కటాక్షించి, నన్నే పురుషుడైనా కనికరించి భార్యగా స్వీకరించితే ఉత్తమ గృహిణీత్వంతో ఆదర్శంగా జీవించాలని కూడా ఆశపడుతున్నాను." కంపితస్వరాన పూర్తి చేసింది కస్తూరి.


"నీలోని పరివర్తనను మేం మనసారా అభినందిస్తున్నాం కస్తూరి! సహృదయుడైన పురుషుడు నీ జీవితంలో తారసపడి నువ్వు గృహిణిగా జీవించే అదృష్టం ప్రసాదించగలడని కూడా ఆశిస్తున్నాం." చాలా గంభీరంగా, ఉదారంగా పలికాడు రాజారాం.

"ఓ! కథ అడ్డం తిరిగింది." ఎవరో చిన్నగా.

"హా! చింతామణీ!"

'మీరంతా చదువుకొన్నారు. చాలా చాలా తెలిసినవారు. మీలో ఆపాటి సహృదయు లెవరూ లేరా?"

వెలవెలబోతూ ముఖముఖాలు చూచుకొన్నారు. ఇంతవరకూ సహృదయత గురించి సుదీర్ఘమైన ఉపన్యాసం యిచ్చిన



రాజారాం మహాశయుడు కూడా బెల్లం కొట్టిన రాయిలా ఉండిపోయాడు.

తిరస్కారంగా నవ్వి, పేలవంగా అంది కస్తూరి: "మీ జీవితంలో సుఖం వెలిగించుకొనే ఒత్తులుగా మమ్మల్ని వాడుకొనే మీరు మా జీవితంలో ఒత్తులు వెలగించే ఊహ, సహృదయత మీ కెప్పటికి కలిగేను?" విస్పృహగా నిట్టూర్చి, తిరిగి దృఢనిశ్చయం స్వరంలో ప్రతిధ్వనిస్తూంటే అంది: "నా ప్రయత్నం, నా ఆశ ఎంత కష్టసాధ్యమైనవో ఇప్పుడే, ఇక్కడే తేలిపోయింది. కాని, మరణపర్యంతం దృఢదీక్షతో ప్రయత్నిస్తూనే ఉంటాను.... సెలవు, రాజారాం గారూ? వస్తాను!" బరువుగా ఊపిరి వదిలి వెనుదిరిగింది.

"కస్తూరీ!" పిలిచాడు శ్రీమాలి.

'ఆ పిలుపులోని ఆర్ద్రతకు కస్తూరిలోని ఆశలు చివురులు తొడగగా ఆత్రంగా, ఆనందప్రకంపనాలు ముఖంలో ప్రతిఫలిస్తూంటే ఇటు తిరిగింది.

వాళ్ళందరి మధ్యనుంచి చివ్వున లేచి రెండడుగులు ముందుకు వేసి కస్తూరి చెయి అందుకొన్నాడు శ్రీమాలి. "నాలోని కుల గర్వాంధత ఇప్పుడే విడిపోయింది, కస్తూరీ! పోతే — నీ జీవితం ఎంత కలుషితమై పోయినా అందుకు ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నావు. సిగ్గు పడుతున్నావు. పాపంనుండే పుడుతుంది పశ్చాత్తాపం. పశ్చాత్తాప శిఖలలోనే ఔన్నత్యపు శిఖరాలు వెలిసేది. నేను నిన్ను నిండు మనసుతో స్వీకరిస్తాను, కస్తూరీ!"

"శాస్త్రీ! శాస్త్రీ!" కంగారుగా పిలిచారు మిత్రులు.

"ఒకరాత్రికి పదిరూపాయలిచ్చి దానితో పోయానురా!" పైకి అనలేక నాలిక పళ్ళ మధ్య కరుచుకొన్నాడు శివనారాయణ.

కస్తూరి చెయ్యి వదలకుండా శ్రీమాలి ముందుకు సాగిపోతూంటే విభ్రాంతితో చూస్తూ కొయ్యబారి నిలబడిపోయింది మిత్ర బృందం.

* *

గుళ్ళో గంట గణగణ మ్రోగింది.

వేణుగోపాలస్వామి గోవునానుకొని ముగ్ధ మోహనంగా చిరునవ్వు చిందిస్తున్నాడు గుళ్ళో.

కస్తూరి సరసన నిలబడిన శ్రీమాలి— "క్షత్రియుడవై పుట్టి, గొల్లవాడలో పెరిగి, గొల్లలతో జీవితం పంచుకొన్న ఆదర్శ మూర్తివి! ఇన్నాళ్ళు నిన్ను సేవిస్తూకూడా నువ్వు చూపుతున్న మార్గంవైపు చూపు మలపలేదు. ఈనాడు జ్ఞానోదయమైంది, భగవాన్!" అనుకొన్నాడు తపనగా.

కస్తూరిని అక్కడే ఆపి ఇంట్లోకి వచ్చాడు శ్రీమాలి.

"వీళ్ళింకా భోజనానికి రాలేదేంరా? కౌసల్యమ్మ ఎవరికో చెప్పి వస్తానంటూ వెళ్ళి ఆవిడా రాలేదు. కాత్యాయనీ ఎక్కడికో వెళ్ళి ఆ పిల్లా రాలేదు. మధ్యరాత్రికి భోంచేస్తారా వీళ్ళు వచ్చి?.... నీకు వడ్డించనా?"

"ఇహ కౌసల్యమ్మ రాదు, బామ్మా!"

"ఎందుకురా?" ఆశ్చర్యంగా అడిగింది బామ్మ.

"బామ్మా!" బామ్మ భుజాలు పట్టుకొన్నాడు శ్రీమాలి. "నువ్వనుకొన్నట్టు నేను కుర్ర వాగన్నను కాదు, బామ్మా! నేను.... నేను చాలా పెద్దవాడినైపోయాను. నువ్వు ఊహించనంత పెద్దవాడినైపోయాను."

తన గుండెల్లో బేలగా తల దాచుకొన్న మనుమడి శిరసూ, వీపూ కంపిత హస్తాలతో తడుతూ బామ్మ కంగారుగా ప్రశ్నించింది— "మనూ, ఏమైందిరా?" అంటూ,

భక్తులెవరో గుళ్ళో గణగణా గంట మ్రోగిస్తున్నారు.